క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన వైద్యులు


రాకేష్‌కుమార్


వెంకటేశ్వర్లు


మధువరన్


తేజశ్విని

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో నూతనంగా నలుగురు డాక్టర్లు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సుజాతనగర్ పీహెచ్‌సీలో కాంట్రాక్ట్‌పై పనిచేసిన డాక్టర్ జి.రాకేష్ కుమార్ జూలూరుపాడు పీహెచ్‌సీ రెగ్యులర్ డాక్టరుగా నియమితులయ్యారు. అదేవిధంగా అశ్వారావుపేట సీహెచ్‌సీలో కాంట్రాక్టుపై డాక్టరుగా పనిచేసిన వెంకటేశ్వర్లు, ఇండియన్ ఆర్మీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ వి.మధువరన్, కామేపల్లి పీహెచ్‌సీలో కాంట్రాక్టుపై మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన ఎస్.తేజశ్విని జూలూరుపాడు పీహెచ్‌సీ రెగ్యులర్ డాక్టర్లుగా నియమితులయ్యారు.

గోర్‌మాటి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

జూలూరుపాడు: బంజారా జాతి ఐక్యత కోసం ఈ నెల 8న జూలూరుపాడులో జరగనున్న గోర్‌మాటి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎంఈఓ గుగులోత్ వెంకట్ టీచర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడు కేజీబీవీ బంజారా జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. గోర్ మాటి సమ్మేళనానికి బంజారా ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాప్రతినిధులు, విద్యావంతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బంజారా జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా దేవీలాల్ నాయక్, హలావత్ నరసింహా, మాలోత్ లాలు, లక్ష్మణ్, బాలు నాయక్, హలావత్ రమణ, ధరావత్ శ్రీను, బానోత్ శ్రీను, ఎల్.మురళీకృష్ణ, శంకర్, భాస్కర్, అశోక్, నరసింహా, హనుమా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న పూర్ణచందర్‌రావు

ఇల్లెందురూరల్: జగిత్యాల ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్‌లో సీటు సాధించిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎస్‌కే సనకు సింగరేణి జేకే ఓసీ కార్మికులు, జమాత్ ఏ ఇస్లామి హింద్ సంస్థ ఆర్థిక చేయూతనందించి ఔదార్యం చాటుకున్నారు. జేకే ఓసీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని సనకు రూ.పది వేలు ఏరియా సేఫ్టీ మేనేజర్ పూర్ణచందర్‌రావు అందజేశారు. ఎస్.రంగనాథ్, సిరాజ్ అహ్మద్, డీఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి

పాల్వంచ: కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్142) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాలకు చెందిన పలువురు యూనియన్‌లో చేరారు. వెంపటి వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసచారి, ఎస్‌కె.సయ్యద్, ఎం.శివరాం, బి.సుమన్, ఎస్.నాగభూషణం, అనిల్, ప్రసాద్, రమణయ్య, రమేష్, పార్వతి పాల్గొన్నారు.

మిర్చి రైతు కంట కన్నీరు

- నల్లతామర, వేరుకుళ్లు తెగుళ్లు వ్యాప్తి
- ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గని ఉధృతి
- లబోదిబోమంటున్న రైతులు


వైరస్ సోకి ఎండిపోతున్న మిర్చితోట

పాల్వంచరూరల్: ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో మాయదారి తెగుళ్ల మిర్చిపంటకు నష్టం చేస్తున్నాయని రైతులు దిగులు చెందుతున్నారు. నల్లతామర వైరస్, వేరుకుళ్ల మిర్చి పంటను ఆశించి మొక్కలు ఎండిపోతున్నాయి. నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 36 గ్రామపంచాయతీల పరిధిలో ఈ ఏడాది 4 – 5 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు మిర్చి సాగు చేశారు. గతేడాది మిర్చిపంటకు అధిక ధర పలకడంతో ఈ ఏడాది ఎక్కువ మంది మిర్చి సాగుకే మొగ్గుచూపారు. మరో రెండునెలల్లో పంట చేతికి రానున్న సమయంలో మిర్చి పంటకు నల్లతామర తెగులు ఆశించింది. మార్కెట్‌లో పలు రకాల మందులను కొనుగోలు చేసి పిచికారీ చేసినా తగ్గలేదని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సమస్య ఒక్క పాల్వంచ మండలంలోనే కాదు. ఇల్లెందు, టేకులపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం తదితర మండలాల్లో కూడా నల్లతామర వైరస్ మిర్చి పంటకు సోకడంతో కొన్నిచోట్ల రైతులు పంటను తొలగించినట్లు సమాచారం. ఈ వైరస్ ఆశించిన తోటలకు వేలాది రూపాయలు ఖర్చు చేసి అనేక రకాల మందులను పిచికారీ చేసినా ఫలితం లేదంటున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా స్వయంగా వచ్చి మిర్చి తోటలను పరిశీలించారు. అయినా నల్లతామర వైరస్ తగ్గేందుకు ఎవరూ మందులు సూచించడం లేదని రైతులు వాపోతున్నారు. నల్లతామర వైరస్, వేరుకుళ్ల సోకిన మిర్చి తోటలకు ఈ ఏడాది పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని ప్రభుత్వమే ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


తెగులు ఆశించిన తోటను చూపుతున్న రైతు

పెట్టుబడి బాగా పెరిగింది



ఈ ఏడాది రెండు ఎకరాల విస్తీర్ణంలో మిర్చిపంట సాగుచేశాను. పూత, కాత దశలో ఉంది. నల్ల తామర వైరస్ వచ్చింది. నివారణ కోసం పెద్దమొత్తంలో పలుమార్లు మందులు పిచికారీ చేశాం. పెట్టుబడి పెరిగింది కానీ వైరస్ తగ్గలేదు. ఇక ఆశలు వదులుకున్నాం

– సాగంటి శ్రీను, రైతు, రెడ్డిగూడెం

అధికారులు సూచనలివ్వాలి



మేము రెండు ఎకరాల విస్తీర్ణంలో మిర్చిపంట సాగుచేశాం. ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు వరకు పెట్టుబడి పెట్టినం. తోట బాగా పూత, కాత దశలోఉంది. ఈ క్రమంలో నల్లతామర, తెల్లదోమ ఆశించి పంట మొత్తం దెబ్బతిన్నది. అధికారులు వచ్చి తగు సలహాలు ఇవ్వాలి.

– భూక్యా ధంజా, రైతు, సూరారం

నల్లతామరకు మందులు లేవు



నల్లతామర వైరస్ గతేడాది కూడా ఉంది. దీనికి మందులు లేవు. అయితే రైతులకు మాత్రం తెల్లదోమకు వినియోగించే జిగురు అట్టాలను తోటలో పెట్టుకోవాలని సూచనలు ఇస్తున్నాం. వేరుకుళ్ల ఆశించిన మిర్చి మొక్కలను వేళ్లతో సహా పీకీ దూరంగా వేసుకోవాలి.

– శంకర్, వ్యవసాయశాఖాధికారి

సృజనాత్మకతతో బోధించాలి


బోధన సామగ్రిని పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: పాఠశాలల్లో సృజనాత్మకతతో బోధన జరగాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇల్లెందు మండల స్థాయి ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల టీఎల్ఎం మేళా స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. మేళాను ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రతి అంశంలో విద్యార్థులకు సరళంగా బోధన ఉండాలని అందుకు ఆయా అంశాలపై మేళా రూపొందించి దాని ద్వారా వివరిస్తే విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. సంక్లిష్ట అంశాలను బోధించేందుకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ నాలుగు సబ్జెక్టుల్లో తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల పరిశుభ్రతలో తయారు చేసి సరళంగా బోధన సాగేలా అతి తక్కువ ఖర్చుతో తయారు చేసిన మెటీరియల్‌ను ఉపయోగించి బోధించాలని సూచించారు. మండల స్థాయి టీఎల్ఎం మేళాలో 20 ప్రాజెక్టులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించటం జరుగుతుందని ఎంఈఓ రాంసింగ్ ఠాగూర్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అంకుషావలీ, నోడల్ ఆఫీసర్ టీవీఆర్ ఎస్ స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండగా ఉంటాం..


వ్యాపారులతో మాట్లాడుతున్న పోట్ల నాగేశ్వరరావు

కొత్తగూడెంరూరల్: చిరువ్యాపారులను రోడ్డుపాలు చేసిన, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన కమిషనరుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మున్సిపల్ మార్కెట్‌లో చిరువ్యాపారులను కలిసి మాట్లాడారు. జరిగిన నష్టానికి కమిషనరే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు మాళోత్ రాందాస్ నాయక్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ మోతుకూరి ధర్మారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల అర్జున్‌రావు, గరీబ్‌పేట ఎంపీటీసీ కసనబోయిన భద్రం, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి వీరాపురం రామలక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పర్యటన

కొత్తగూడెం మున్సిపాలిటీలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు పర్యటించారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జేబీ శౌరీ, మాళోత్ రాందాస్‌నాయక్, ఏనుగుల అర్జున్‌రావు, వీరాపురం రామలక్ష్మణ్‌రావు, మహమ్మద్ గౌస్, అల్లాడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి


ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: పీఎంహెచ్ హాస్టల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని పీఎంహెచ్ హాస్టల్ ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహించారు. 15 నెలలుగా కార్మికులు వేతనాల కోసం అలమటిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో జయ, సుబ్రమణ్యం, ధనలక్ష్మి, రమ, అంజమ్మ, సుజాత, కిషన్, అనిత, రాంబాబు, విజయ భారతి, వెంకటమ్మ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

ఇల్లెందు: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి హరిలాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. అన్ని పాఠశాలలు సక్రమంగా నడవాలంటే బదిలీలు, పదోన్నతలు చేపట్టాలని కోరారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సరళ, జి.సమ్మయ్య, ఇమ్మానియేల్, సీహెచ్ రమేష్, వీరన్న, రాంజీ, బాలాజీ, శంకర్, తులిసీరాం తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్‌లో బ్యాటరీలు చోరీ

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలోని ఎయిర్‌టెల్ టవర్ షెల్టర్ రూంలో 18 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. మంగళవారం టవర్‌ను పరిశీలించిన ఎయిర్‌టెల్ జిల్లా సెక్యూరిటీ సూపర్‌వైజర్ చోరీ జరిగినట్లు గుర్తించి కొమరారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: బోయితండా పంచాయతీ సర్వే తండా గ్రామంలో సుమన్, రుక్మ దంపతులు తమపై దాడి చేశారని అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్, కమిలి మంగళవారం కొమరారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి


సాజి(ఫైల్)

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండాకు చెందిన జాటోతు సాజి (130) మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

కేజీబీవీ నిర్వాహకులపై ఎంపీపీ ఆగ్రహం


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

టేకులపల్లి: మీ పిల్లలకైతే ఇలాగే పెడతారా.. నీళ్ల చారు.. చప్పిడి కూరలు పిల్లలు ఎలా తింటారు..? ఇలాగైతే పిల్లలకు పోషకాహారం ఎలా లభిస్తుంది..? వారి ఆరోగ్యానికి భరోసా ఎవరు..? అంటూ టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ, కోఆప్షన్ సభ్యుడు మౌలానా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సమయంలో పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్టోర్ రూంలో కూరగాయలు, పండ్లు, గుడ్లు లేకపోవడాన్ని చూసి పాఠశాల ఎస్‌ఓను నిలదీశారు. సరుకులు అందుబాటులో లేకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గదుల్లో ఫ్యాన్లు లేకపోవడం, నూతన కాలేజీ భవనంలో విద్యుత్ సదుపాయం లేకపోవడం, హ్యాండ్ వాష్ ట్యాప్‌లకు నీటి సరఫరా లేకపోవడం తదితర సమస్యలు తెలుసుకుని విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే ప్లంబర్‌ను పిలిపించి ఎస్టిమేషన్ వేయించారు. తన నిధులు ఇస్తానని ప్లంబింగ్ వస్తువులు తెచ్చుకోవాలని సూచించారు.

హక్కులు సాధించుకుందాం


మాట్లాడుతున్న మచ్చా శ్రీనివాసరావు

పాల్వంచ: యాదవులు హక్కుల సాధన కోసం కృషి చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ ఆత్మలింగేశ్వరాలయం వద్ద కొడగాని పరమేష్ యాదవ్ అధ్యక్షతన సంఘం జిల్లా మహాసభ నిర్వహించారు. గొర్రెల సహకార సంఘాల ఆడిట్, ప్రభుత్వం నుంచి రెండో విడత గొర్రెల పంపకం, సంఘం పటిష్టత, జిల్లా కమిటీ, నియోజవర్గ బాధ్యుల నియామకం, మండల, గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. మచ్చా మాట్లాడుతూ.. రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాగ సీతారాములు, దొడ్డాకుల రాజేశ్వర్, కోదాడ శ్రీనివాస్, వల్లపు యాకయ్య, సుంకరబోయిన సత్యనారాయణ, గల్లా నాగభూషణం, గోసు రామారావు, వల్లపు మల్లయ్య, మేకల లింగయ్య, శ్యాం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి పూర్వవైభవం రాబోతోంది..



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

ఇల్లెందు: రాష్ట్రంలో సీపీఐకి పూర్వవైభవం రాబోతోందని, ప్రతీ కార్యకర్త, నాయకుడు ఎర్ర జెండా సమున్నతం కోసం అహర్నిషలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మిర్యాల రంగయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో చట్ట సభల్లో సీపీఐకి ప్రాతినిధ్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ దిశగా సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. 6వ తేదీన పార్టీ 98వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో అమరవీరుల స్మారక స్తూపం ఆవిష్కరణ ఉంటుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.సారయ్య, బంధం నాగయ్య, ఏపూరి బ్రహ్మం, ఉడుత ఐలయ్య, దేవరకొండ శంకర్, నజీర్ అహ్మద్, రవీందర్, షంషుద్దీన్, కొమురయ్య, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ


సింగరేణి(కొత్తగూడెం): క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యవతి తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఇన్‌కమ్ ట్యాక్స్ రాష్ట్ర కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా హాజరయ్యారు. అలాగే సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు చంద్రశేఖర్, ఎస్.బలరామ్, సత్యనారాయణరావు క్యాలెండర్లను ఆవిష్కరించారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.భాస్కర్‌రావు, బి.నాగేశ్వరరావుతో పాటు డి.పంతులు, తారాచంద్, బి.వెంకట్రాం, ఏ.ఉపేందర్, డి.రాజేష్, జి.దశరథ్, వీరన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: హైదరాబాద్ ఎస్‌పీడీసీఎల్ మింట్ కాంపౌండ్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎంఏ.వజీర్ పలు సమస్యలను విన్నవించారు. ఆర్టిజన్లకు రావాల్సిన వేతన బకాయిలు ఇవ్వాలని, జీపీఎఫ్ కల్పించాలని, పదోన్నతులు ఇవ్వాలని కోరారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ తకీ, ఎస్.లవకుమార్; గౌసుద్దీన్, అంబాల శ్రీను, ఎం.శ్రీధర్, విజయ్‌కుమార్, నగేష్, రవి, మూర్తి పాల్గొన్నారు.

టేకులపల్లి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు జరుపుతూ ఉపాధ్యాయ లోకానికి పీఆర్‌టీయూ దిక్సూచిగా ఉండాలని టేకులపల్లి ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.రమేష్‌బాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.మోతీలాల్, టి.సర్కార్, ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ అజ్మీర జగన్, బీఎం విజయ నిర్మల, కె.ప్రసాద్, మంగీలాల్, లక్ష్మణ్‌రావు, భద్రు, బాలు, రాజేష్ ఖన్నా, సమ్మయ్య, బాలాజీ, సత్యనారాయణ, సరస్వతి, మోహన్‌రావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


పాల్వంచ: డైరీలు ఆవిష్కరిస్తున్న రఘుమారెడ్డి


టేకులపల్లి: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, ఉపాధ్యాయ నాయకులు

దేశానికి స్ఫూర్తి ప్రదాత సావిత్రీబాయి పూలే

భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాల్లో, విద్యాసంస్థల్లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ఆనాటి సమాజపు కట్టుబాట్లు, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి 1848 మే12న పాఠశాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఎన్నో అవమానాలు ఎదురైనా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సావిత్రీబాయి పూలే చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్


పాల్వంచరూరల్: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు




కొత్తగూడెంఅర్బన్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో.., ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, పాల్వంచ: నివాళులర్పిస్తున్న దిండిగల రాజేందర్





సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా కళాశాలలో.., జూలూరుపాడు: ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో.., ఇల్లెందు: జేకే సింగరేణి హైస్కూల్‌లో...

అటెన్షన్ ప్లీజ్

పెట్రోల్ బంక్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం



నిత్యం 24 గంటలు వాహనాలు, ప్రజల రాకపోకలు ఉండే ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలోని బీసీఎం జాతీయ రహదారికి చెందిన డ్రెయినేజీపై స్లాబ్‌ను సక్రమంగా నిర్మాణం చేయకపోవడంతో డ్రెయినేజీ కూలి పెద్ద రంధ్రం ఏర్పడింది. దీని పైనుంచి నిత్యం బంక్‌కు వచ్చే వాహనాలతోపాటు పక్కన కస్తూర్బా గాంధీ స్కూల్ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కొద్దిరోజులు పోలీసులు బారికేడ్‌ను ఉంచారు. ఇప్పుడు తీసివేశారు. కనీసం హెచ్చరిక బోర్డు కూడా పెట్టలేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : యుగేందర్, ఈఈ, నేషనల్ హైవే అథారిటీ
సెల్ నంబర్: 8333923755